నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
13 | హైదరాబాద్, మంగళవారం 9 జనవరి 2024 | HYDERABAD

అక్రమ నిర్మాణాల కూల్చివేత

శంషాబాద్ రూరల్, జనవరి 8 : చెరువులో చేపట్టిన అక్రమ నిర్మాణాలను సోమవారం అధికారులు కూల్చివేయించారు. ఇరిగేషన్ డీసీ దుద్యనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జోషికుంట చెరువులో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు 'నమస్తే తెలంగాణ'లో కథనం రావడంతో సోమవారం చెరువు వద్దకు చేరుకొన్న ఇరిగేషన్ డీసీ దుద్యానాయక్ అక్రమ నిర్మాణాలను సిబ్బందితో కూల్చివేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ మౌనిక, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంజీవ, అధికారులు బాబురావు, సిబ్బంది పాల్గొన్నారు.

నుమాయిష్‌లో నేడు లేడీస్ స్పెషల్

అబిడ్స్, జనవరి 8 : అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనలో ఈ నెల 9న మహిళలకు మాత్రమే ప్రవేశాన్ని కల్పిస్తున్నట్లు ఉపాధ్యక్షులు వనం సత్యేందర్ తెలిపారు. మంగళవారం ఎగ్జిబిషన్ లోపలికి మహిళలకు మాత్రమే అనుమతిస్తామని వివరించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, దీనికి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరవుతారని అన్నారు.

పతంగుల వేళ.. పిల్లలు పైలం

డీజేలు, లౌడ్‌స్పీకర్లపై నిషేధాజ్ఞలు

హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి

సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : సంక్రాంతి పండుగ నేపథ్యంలో తల్లిదండ్రులు పతంగులు ఎగురవేసే పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. 14, 15వ తేదీలో నగరంలో సంక్రాంతి వేడుకలు జరుగనుండడంతో ప్రార్థనాలయాల పరిసరాలలో పతంగులు ఎగురవేయవద్దని సీపీ నిషేధాజ్ఞలు విధించారు. అలాగే పోలీసుల అనుమతి లేకుండా స్పీకర్లు, డీజేలు ఏర్పాటు చేసుకోవద్దని అన్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య లౌడ్ స్పీకర్లు, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్‌లు ఉపయోగించవద్దని, దీనిపై సుప్రీం కోర్టు మార్గదర్శకాలు ఉన్నాయని అన్నారు. ప్రశాంతతకు భంగం కలిగించకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సీపీ కోరారు.

జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

తూతూ మంత్రంగా ఫుడ్ సేఫ్టీ తనిఖీలు

మేయర్ ప్రశ్నలకు నీళ్లు నమిలిన అధికారులు

పనితీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు

సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశాలు

ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ మొబైల్ వ్యాన్ ఎక్కడుంది? ఎన్ని తనిఖీలు చేశారు? ఎన్ని కేసులయ్యాయి?

సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : నాణ్యతా ప్రమాణాలను పాటించని హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులపై ఉక్కుపాదం మోపాల్సిన జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంపై మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీ ఫుడ్‌పై కఠినంగా ఉండాల్సిన అధికారులే క్షేత్రస్థాయి తనిఖీలు చేయకపోవడంపై మండిపడ్డారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ హెల్త్ స్నేహ శబరీష్, ఫుడ్ సేఫ్టీ అధికారులు, కార్పొరేటర్లతో మేయర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తీసుకువచ్చిన ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ మొబైల్ వ్యాన్ తనిఖీలు ఎన్ని చేశారు? అని మేయర్ ప్రశ్నించగా...నీళ్లు నమలడం అధికారుల వంతైంది. అసలు కొత్తగా వచ్చిన ఫుడ్ సేఫ్టీ అధికారుల వివరాలు కూడా అధికారులు చెప్పలేక తడబడ్డారు. అడిషనల్ కమిషనర్ (హెల్త్)గా స్నేహ శబరీష్ కనీసం సమీక్ష నిర్వహించలేకపోవడం, రిటైర్డ్ అధికారి వ్యవహారశైలిపై ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోవడంపై మేయర్ సీరియస్ అయినట్లు తెలిసింది. ప్రజారోగ్యంపై చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవని మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్లు ఈవీడీఎం విభాగం సహకారంతో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్లలలో కిచెన్ పరిశుభ్రంగా ఉండేలా, అందులో వాడే పదార్థాలు నాణ్యతతో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇదిలా ఉంటే జీహెచ్‌ఎంసీ టోల్ ఫ్రీ నంబరు, 'ఎక్స్' ట్విట్టర్ వేదికగా ప్రజలు ఫిర్యాదులు చేస్తున్న ఎందుకు పట్టించుకోవడం లేదని మేయర్ ప్రశ్నించారు. అధికారులు మాత్రం ఇప్పటి వరకు 74 కేసులు విధించామని చెప్పడం గమనార్హం. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ఫుడ్ సేఫ్టీ సహాయ సంచాలకులు బాలాజీ, నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు సీవీ రెడ్డి, శ్రవణ్, రాజశేఖర్ రెడ్డి, బన్నాల గీత ప్రవీణ్, పద్మ వెంకట్‌రెడ్డి, ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి.. రాంగ్ రూట్‌లో వచ్చి

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఇద్దరికి తీవ్రగాయాలు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 8 : కేపీహెచ్‌బీ కాలనీ నెక్సెస్ మాల్ చౌరస్తాలో రాంగ్ రూట్‌లో వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కేపీహెచ్‌బీ కాలనీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్తాన్‌కు చెందిన బన్వరీలాల్ (24), దూరుచంద్ (33) బతుకుదెరువు కోసం నగరానికొచ్చి హైదర్‌నగర్ జయానగర్‌లో ప్రెస్టేజి కంపెనీకి కిచెన్ వస్తువులను సరఫరా చేస్తూ జీవిస్తున్నారు. ఈ నెల 7న వీరిద్దరూ కేపీహెచ్‌బీ కాలనీ నెక్సెస్ మాల్‌లో సినిమా చూసి బైక్‌పై తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో కారులో అల్లోల అగ్రజారెడ్డి (26), మాచవరపు కార్తిక్ (26), చిదన్ తేజ (27) కలిసి వెళ్తున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు నెక్సెస్ మాల్ చౌరస్తా యూటర్న్ వద్ద రాంగ్ రూట్‌లో కారులో వస్తూ బైక్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న బన్వరీలాల్, దూరుచంద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి వచ్చి క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. కారులో ఉన్న వ్యక్తులు మద్యం సేవించి రాంగ్ రూట్‌లో అతివేగంగా నిర్లక్ష్యంగా కారును నడపడం వల్ల ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. బాధితులు, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

16న నేషనల్ స్టార్టప్ డే

సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : స్టార్టప్ ఇండియా వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని 2021లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జనవరి 16వ తేదీని నేషనల్ స్టార్టప్ డేగా ప్రకటించారు. ఈనేపథ్యంలో జనవరి 16న టీహబ్‌లో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు స్టార్టప్‌ల వ్యవస్థాపకులు, నిపుణులతో ప్రత్యేకంగా ఒక రోజు వర్క్‌షాపును నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు https://bit.ly/3tLGUFL లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని టీహబ్ నిర్వాహకులు సూచించారు.

దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

ప్రజావాణిలో అధికారులను ఆదేశించిన కలెక్టర్

సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేర కు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్, ఆర్డీవో రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణిలో 67 అర్జీలను స్వీకరించినట్లు చెప్పారు.

హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్ట్

డైరెక్టర్‌గా ప్రదీప్ కుమార్

సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) అర్బన్ ఫారెస్ట్ విభాగం డైరెక్టర్ డాక్టర్ బి.ప్రభాకర్‌ను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం బదిలీ చేసింది. ఆయన స్థానంలో పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖలో స్పెషల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎస్.వి.ప్రదీప్‌కుమార్ శెట్టిని నియమించింది. ప్రభాకర్‌ను ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి ఆదేశాలు జారీ చేశారు.

వీధి కుక్కలపై చర్యలేవి?

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : కుక్కకాటుతో ఇటీవల బాలుడు మృతి చెందారని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్, వెటర్నరీ అధికారులు, వీధి కుక్కల బెడద కుక్కకాటు నివారణకు ఏర్పాటైన హైలెవల్ కమిటీ సభ్యులైన కార్పొరేటర్లతో మేయర్ సమావేశం నిర్వహించారు. వీధి కుక్కలకు రెగ్యులర్‌గా రేబిస్ వ్యాక్సిన్ అందించేందుకు వెటర్నరీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జీహెచ్‌ఎంసీకి చుట్టుపక్కల ఉన్న 16 మున్సిపాలిటీలలో యాంటీ బర్త్ కంట్రోల్ ఆపరేషన్స్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. స్టెరిలైజేషన్ ఆనంతరం నాలుగు రోజుల పాటు వాటిని కేంద్రాల్లోనే ఉంచిన తర్వాత విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, కార్పొరేటర్లు సీవీ రెడ్డి, శ్రవణ్, రాజశేఖర్ రెడ్డి, బన్నాల గీత ప్రవీణ్, పద్మ వెంకట్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్లు, వెటర్నరీ డాక్టర్లు పాల్గొన్నారు.

ప్రజావాణి షురూ.. ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి ప్రారంభించి, అర్జీలను స్వీకరిస్తున్న మేయర్ విజయలక్ష్మి

ఒక్క దరఖాస్తుకు గంట!

అభయహస్తం అప్లికేషన్ అప్‌లోడ్‌కు సాంకేతిక సమస్య

తరచూ సర్వర్‌డౌన్‌తో విసిగిపోతున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు

నిర్దేశిత లక్ష్యంలోపు పూర్తి కావడంపై అనుమానాలు

రెండు రోజులైనా టార్గెట్‌లో సగం పూర్తి కాని దరఖాస్తులు

అధికారుల వైఖరిపై విమర్శల వెల్లువ

సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : సాంకేతిక సమస్యల నడుమ అభయహస్తం దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రక్రియ నడుస్తోంది. ఒక్క దరఖాస్తుకు గంట సమయం తీసుకుంటున్నది. దరఖాస్తులో ఉన్న వివరాలన్నింటినీ అప్‌లోడ్ చేసే క్రమంలో చివర సబ్మిట్ బటన్ నొక్కాగానే సర్వర్ డౌన్ అంటూ సమస్య తలెత్తుతుందని డేటా ఎంట్రీ ఆపరేటర్లు చెబుతున్నారు. పెద్ద ఎత్తున వచ్చిన దరఖాస్తుల అప్‌లోడ్‌లో అందుకు తగ్గట్లుగా సాంకేతిక సమస్య తలెత్తకుండా పక్కాగా చర్యలు చేపట్టాల్సిన అధికారులు ఏ మాత్రం పట్టించుకోని కారణంగానే ఈ పరిస్థితులు తలెత్తుతున్నాయని పేర్కొంటున్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని 30 సర్కిళ్లలో దాదాపు 3500 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించుకున్నారు. మొత్తం స్వీకరించిన 24,74,325 దరఖాస్తులలో రేషన్ కార్డు, ఇతర దరఖాస్తులు 5,73,069లు మినహా అభయహస్తం కింద స్వీకరించిన దరఖాస్తులు 19,01,256లు మాత్రమే ప్రాధాన్యత క్రమంలో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ నెల 17 వరకు అభయహస్తం దరఖాస్తుల డేటా ఎంట్రీని పూర్తి చేయాలని, ఇందుకు సీనియర్ ఐఏఎస్‌లకు పర్యవేక్షణాధికార బాధ్యతలు అప్పగించారు. కానీ రెండు రోజులుగా ఒక్కో దరఖాస్తుకు గంట సమయం తీసుకోవడం, రోజువారీ లక్ష్యంలో సగం కూడా ఎంట్రీ కాకపోవడంతో దరఖాస్తుదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వివరాల ఆధారంగా అర్హులకు సకాలంలో అభయహస్తం పథకం ఫలాలు అందుతాయన్న లబ్ధిదారుల ఆశలపై అధికారుల నీళ్లు చల్లుతున్నారు. వెంటనే తరచూ తలెత్తే సాంకేతిక సమస్యలను అధిగమించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

ఎన్నో అనుమానాలు..

కాగా పండగ సెలవులు..భారీ దరఖాస్తులు వెరసి గడువులోగా దరఖాస్తుల ఎంట్రీ పూర్తవుతుందో! లేదో? అన్న అనుమానాలు వస్తున్నాయి. అదీగాక అర్హుల ఎంపికకు ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు మార్గదర్శకాలు రాలేదు. మార్గదర్శకాలు వచ్చాక మరోదఫా సర్వే చేసి అర్హుల పేర్లను పోర్టల్‌లో ఉంచుతారని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఎంట్రీలో తప్పులు దొర్లితే సవరణలకు అవకాశం ఉంటుందా? లేదా! అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

నాలా పనులు పూర్తి చేయండి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : స్మార్ట్ వాటర్ నాలా పనులను పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం యాకత్‌పుర నియోజకవర్గంలో ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్‌తో కలిసి ఆయన నాలా పనులను పరిశీలించారు. తలాబ్‌కట్ట నాలా పనులు పూర్తి కావడానికి భూసేకరణ చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం కమిషనర్ రెయిన్ బజార్ నాలా పనులను పరిశీలించి, వాటర్ లాగింగ్ లేకుండా చేయాలన్నారు. యాకుత్‌పురలో రైల్వే ట్రాక్‌కు అనుకొని ఉన్న మురుగు కాల్వ పాత రిటర్నింగ్ వాల్‌ను పునరుద్ధరించాలని చెప్పారు. యాకుత్‌పురలో వెహికల్ అండర్‌పాస్ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో వీయూపీ వర్షపు నీరు నిల్వ లేకుండా తగిన ప్రణాళిక తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్ఈ దత్తు, జోనల్ కమిషనర్ వెంకన్న, కార్పొరేటర్లు మహమ్మద్ వాసి, డాక్టర్ సమీనా, నస్రీన్ సుల్తానా, ముజఫర్, అల్మదార్ వాలజహి శాఫాత్ తదితరులు పాల్గొన్నారు.

యాకత్‌పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్‌తో కలిసి నాలా పనులను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తదితరులు

నెలాఖరు వరకు ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యువల్

ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31 వరకు 25 శాతం అపరాధ రుసుం

ఏప్రిల్ 1 తర్వాత దరఖాస్తులపై అదనంగా 50 శాతం

సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ హైదరాబాద్‌లో ఉన్న ట్రేడర్లు తమ లైసెన్స్‌లను ఈ ఏడాదికిగానూ పునరుద్ధరించుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రేడ్ లైసెన్స్‌ల గడువు డిసెంబరు 31తో ముగిసిందని, ఈ నెల 31లోగా తమ లైసెన్స్‌లను రెన్యువల్ చేయించుకోవాలన్నారు. ప్రతి ట్రేడ్ లైసెన్స్ పునరుద్ధరణకు రుసుము రూ.5 వేలు అని పేర్కొన్నారు. ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31 వరకు రెన్యువల్ చేస్తే 25 శాతం అపరాధ రుసుం, ఏప్రిల్ 1 తర్వాత లైసెన్స్‌లను పునరుద్ధరిస్తే 50 శాతం ఆపరాధ రుసుం వసూలు చేయనున్నట్లు తెలిపారు. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే 100 శాతం జరిమానాతో పాటు నెలకు 10 శాతం అదనంగా చెల్లించాలని పేర్కొన్నారు. కొత్తగా ట్రేడ్ లైసెన్స్‌లను ఆన్‌లైన్, ఈ-సేవా కేంద్రాలు, జీహెచ్‌ఎంసీ సిటిజన్ సర్వీస్ సెంటర్లు, జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాలలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర సమాచారం కోసం జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్ WWW.GHMC.GOV.IN ను సంప్రదించాలని కమిషనర్ సూచించారు.